సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం। 12। డిసెంబర్। 2022

గిరి విద్యార్థినికి అభినందన



సాక్షి, పాడేరు: తిరుపతి జిల్లా గూడూరులో జరిగిన రాష్ట్ర స్థాయి బాలల సైన్స్ పోటీల్లో పాడేరు కేజీబీవీ పాఠశాల 9వ తరగతి గిరి విద్యార్థిని ఎ.రూపవతి ప్రదర్శించిన నమూనా ప్రథమ స్థానం సాధించింది. ముంచంగిపుట్టుతో పాటు, సరిహద్దు ఒడిశాలో గిరిజనులు తయారుచేసే బత్తిరిపిండి, పాలు, దుంపల సాగు, పౌష్టికాహార విలువలపై నమూనాను ప్రదర్శించిన విద్యార్థిని రూపవతిని పర్యాటక, సాంస్కృతిక శాఖమంత్రి ఆర్‌కే రోజా అభినందించారు.

24 గంటల్లోనే చోరీ కేసు ఛేదన



- రూ.1.50 లక్షల రికవరీ, 2 బైక్‌లు స్వాధీనం
- 9న బాధిత వ్యాపారి కొయ్యూరు పోలీసులకు ఫిర్యాదు
- 10న ముగ్గురు నిందితుల అరెస్టు

8లో

న్యూస్‌రీల్

14న జాబ్‌మేళా

కంచరపాలెం(విశాఖ ఉత్తర): స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 14న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి(టెక్నికల్) కె.సుధ ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో హోమ్ కేర్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీల్లో హోమ్ కేర్స్ నర్స్, ట్రైనీ కెమిస్ట్, డెవలప్‌మెంట్ మేనేజర్ తదితర 260 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఆయా ఉద్యోగాలకు జీడీఏ, ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్, బీఎస్సీ కెమిస్ట్రీలో ఉత్తీర్ణత సాధించి 18–42 ఏళ్ల వయసు గల వారు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాన్ని బట్టి నెలకు జీతం రూ12,500 నుంచి రూ.28,200 ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ncr.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

కరాటే పోటీల విజేత ఏపీ



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న ఎంపీ జీవీఎల్, హీరో సుమన్ తదితరులు

విశాఖ స్పోర్ట్స్: జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్‌లో ఏపీ జట్టు విజేతగా నిలిచింది. పశ్చిమబెంగాల్ రన్నరప్‌గా, ఒడిశా సెకండ్ రన్నరప్‌గా నిలిచాయి. వడోకాయ్ కరాటే డో సంఘం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు పోర్ట్ స్టేడియంలో కాటా, కుమిటీ అంశాల్లో పోటీలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి రాజ్యసభ ఎంపీ జి.వి.ఎల్.నరసింహారావు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, సినీనటుడు సుమన్, నిర్వాహక కమిటీ చైర్మన్ నర్సింగరావు తదితరులు పాల్గొని విజేతలకు ట్రోఫీలందించారు.

గురి తప్పకుండా ఫైరింగ్

వెపన్స్‌తో పోలీసులు ప్రాక్టీస్



ఫైరింగ్‌లో నైపుణ్యం ప్రదర్శిస్తున్న పోలీసు అధికారులు

పీఎంపాలెం (భీమిలి): నగర పోలీస్ యంత్రాంగం పనితీరు ఉత్తమంగా ఉండాలని పోలీసు కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ధృడనిశ్చయం. విధి నిర్వహణలో భాగం అవసరమైతే గురి తప్పని విధంగా తుపాకీ పేల్చడంలోనూ నైపుణ్యం కలిగి ఉండాలి. ఇందు కోసం గ్రేహౌండ్స్ రేంజ్‌ను వేదికగా తీసుకుని శని,ఆదివారాల్లో వివిధ వెపన్స్‌తో ఫైరింగ్ ప్రాక్టీసు చేశారు.

అప్రమత్తతే ప్రధానం

మాండూస్ తుపాను నేపథ్యంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరిపనలు తడిసిపోయాయి. ఈ పరిస్థితుల్లో నష్టం వాటిల్లకుండా ఉండేందుకు రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ సూచిస్తోంది. వరి పనలు ఆరబెట్టిన పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవడమే కాకుండా తడిసిన వన లపై ఉప్పు ద్రావణం పిచికారీ చేయడం ద్వారా మొలక రాకుండా నివారించవచ్చని సూచిస్తోంది. పంట దెబ్బతింటే ఇన్సూరెన్సు వర్తిస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపింది.



కూనవరం ప్రాంతంలో కోసిన వరిపనలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న రైతులు

- వర్షాల నేపథ్యంలో రైతులకు అండగా వ్యవసాయశాఖ
- పంట సంరక్షణపై ఎప్పటికప్పుడు సూచనలు
- నష్టం నుంచి బయటపడేలా పటిష్ట చర్యలు
- రైతులకు అండగా ఈక్రాప్

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం ఉదయం పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలతో పాటు, చింతూరు, రంపచోడవరం డివిజన్‌ల పరిధిలో వర్షం తగ్గుముఖం పట్టింది. మధ్యాహ్నం నుంచి వర్షం మళ్లీ ప్రారంభమవ్వడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. అనంతగిరి, అరకులోయ,డుంబ్రిగుడ మండలాల్లో మాత్రం శనివారం రాత్రి నుంచి వర్షం కురుస్తూనే ఉంది. వ్యవసాయశాఖ అధికారులు, సచివాలయ పరిధిలోని వ్యవసాయ అసిస్టెంట్లంతా వరి, ఇతర చోడి, రాజ్‌మా, చిరుధాన్యాలు వంటి వాణిజ్యపంటలను కాపాడే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు.గిరిజన రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే 30 శాతం మేర కోసిన వరి పనలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు కుప్పలు పెట్టి, వాటికి ప్లాస్టిక్ కవర్లను కప్పారు. రెండు రోజుల వర్షానికి తడిచిన వరిపనలపై ఉప్పు ద్రావణాన్ని రైతులు పిచికారి చేస్తున్నారు. భారీ వర్షాలు కురవకపోవడంతో పంట నష్టం లేదని, అయినప్పటికీ రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి నందు తెలిపారు.

జిల్లాలో వర్షపాతం వివరాలు

జిల్లా వ్యాప్తంగా ఆదివారం 76.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా అనంతగిరిలో 23.2.అరకులోయలో 9.4, డుంబ్రిగుడలో 7ఎంఎం , దేవీపట్నంలో 7ఎంఎం, ముంచంగిపుట్టులో 4, వై.రామవరంలో 3ఎంఎం, అడ్డతీగలలో 3ఎంఎం, గంగవరంలో 2.8ఎంఎం, మారేడుమిల్లిలో 2.4 ఎంఎం, చింతపల్లిలో 2.6 ఎంఎం, జి.మాడుగులలో 2.4 ఎంఎం, పాడేరులో 2.2 ఎంఎం వర్షపాతం నమోదైంది.

రాజవొమ్మంగి: మండలంలో ఆదివారం కురిసిన వర్షానికి సుమారు 200 ఎకరాల్లో వరి పనలు తడిసిపోయినట్టు ఏవో రమేష్‌నాయుడు తెలిపారు. దాదాపు 6,500 ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగయ్యింది. కాగా ఇప్పటి వరకు 2వేల ఎకరాల్లో మాత్రమే పంటకోతలు జరిగాయి. చాలా వరకు కోతలు యంత్రాలతో చేపట్టి దాదాపు 205 టన్నుల ధాన్యాన్ని రైతులు ఇప్పటికే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించారు. మరి కొంత పంట పొలాల్లోనే ధాన్యం రాసులుగా, కుప్పలుగా వుంది. వర్షం తగ్గుముఖం పడితే ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. కుప్పలు, ధాన్యం రాసులు తడిసిపోకుండా ఎండు గడ్డి, టార్పాలిన్లు కప్పి జాగ్రత్త పడుతున్నారు. తడిసిన వరి పంట వివరాలను ఉన్నతాధికారులకు నివేదించామని ఆయన పేర్కొన్నారు. కొనుగోళ్లలో తడిసిన ధాన్యానికి తేమ విషయంలో మినహాయింపు ఉండవచ్చని ఆయన అన్నారు. పంట దెబ్బతింటే ఇన్సూరెన్సు వస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.



రాజవొమ్మంగిలో తడిసిన వరి పనలు



డుంబ్రిగుడ ప్రాంతంలో వరి కుప్పలపై కప్పిన టార్పాలిన్లు

కొయ్యూరు: మండలంలో పొలంలో ఆరబెట్టిన వరి పనలు తడిసిపోయాయి. ఆదివారం మధ్యాహ్నం సుమారు అరగంట సేపు భారీ వర్షం కురిసింది. మండలంలో సుమారు 8 వేల ఎకరాల వరిసాగు చేపట్టారు. వాతావరణంలో మార్పుల కారణంగా పూర్తిస్థాయిలో కోతలు చేపట్టలేదు.

డుంబ్రిగుడ: మండలంలో ఆదివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరిపనలు అక్కడక్కడ తడిసిపోయాయి. రైతులు ముందు జాగ్రత్తగా వరి పనలను కుప్పలుగా వేసి టార్పాలిన్లు రక్షణగా ఏర్పాటుచేశారు.

తల్లిదండ్రులపై మమకారంతో..

- ఏటా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్న పోలీసు ఉన్నతాధికారి
- పోటీలను ప్రారంభించిన ఏఎస్పీ, ఏసీపీలు



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఏఎస్పీ మహేశ్వరరెడ్డి, ఏసీపీ శివరామయ్య

చింతూరు: తల్లిదండ్రులపై మమకారంతో వారి జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంటును చింతూరుకు చెందిన జూపల్లి వెంకటరత్నం ఏటా నిర్వహిస్తున్నారు. ఈయన ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ సీఐగా పనిచేస్తున్నారు. ఆయన తల్లిదండ్రులైన జూపల్లి లక్ష్మి, ఏసుదాసుకు స్మృతిగా గతేడాది నుంచి జూపల్లి మెమోరియల్ పేరిట క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తూ క్రీడాకారులను ఆయన పోత్సహిస్తున్నారు. దీనిలో భాగంగా ఏర్పాటుచేసిన టోర్నమెంట్‌ను ఆదివారం చింతూరు ఏఎస్పీ మహేశ్వరరెడ్డి, పరకాల ఏసీపీ జూపల్లి శివరామయ్య ప్రారంభించారు. ఏఎస్పీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పోలీసు టీం, సీఐ వెంకటరత్నం ఆధ్వర్యంలో చింతూరు టీంలతో ఫ్రెండ్లీ మ్యాచ్ నిర్వహించారు. నలభై రోజులపాటు జరిగే ఈ టోర్నమెంట్‌లో చింతూరు, వీఆర్‌పురం, కూనవరం, ఎటపాక మండలాలకు చెందిన 80 జట్లు పాల్గొంటున్నాయి. మొదటి బహుమతి రూ. 40 వేలు, ద్వితీయ బహుమతి రూ. 25 వేలు, తృతీయ బహుమతి రూ. 10 వేలు అందించనున్నారు. చింతూరు సీఐ అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, కోఆప్షన్ మెంబర్ ఎండీ అక్బర్‌అలీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పర్యాటకంగా అభివృద్ధి

- త్వరలో అటవీశాఖ పోస్టుల భర్తీ
- కొత్త ఫారెస్టు డివిజన్‌లకు భవన నిర్మాణాలు
- రాష్ట్ర అటవీ సంరక్షణ ప్రధాన అధికారి మధుసూదన్‌రెడ్డి

రంపచోడవరం: ఏజెన్సీని పర్యావరణ పర్యాటక ప్రాంతంగా మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని రాష్ట్ర అటవీ సంరక్షణ ప్రధాన అధికారి వై.మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఏజెన్సీలో ఆదివారం ఆయన పర్యటించారు. చింతూరు మీదుగా పర్యావరణ పర్యాటక కేంద్రమైన మారేడుమిల్లిలోని జంగిల్ స్టార్ క్యాంపునకు చేరుకున్నారు. అక్కడ పర్యాటకుల అతిథి గృహాలను పరిశీలించారు. పర్యాటకులను మరింతగా ఆకట్టుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎకో టూరిజంపై సంతృప్తి వ్యక్తం చేశారు. మారేడుమిల్లి– చింతూరు ఘాట్ రోడ్డులో ఉన్న అమృతధార వాటర్ పాల్స్‌కు పర్యాటకులు సులభంగా చేరుకునేందుకు వీలుగా మార్గం ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందుకు అవసరమైన నిధులు కేటాయిస్తామని చెప్పారు. అమృతధార నిట్టనిలువుగా 800 మీటర్ల ఎత్తులోని కొండపై నుంచి పడుతూ పర్యాటకులను ఎంతో ఆకర్షిస్తుందన్నారు. అటవీ రక్షణలో భాగంగా త్వరలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేస్తామని చెప్పారు. గతంలో కందకాలు తవ్వకాలకు సంబంధించి అభియోగాలు ఎదుర్కొంటున్న 70 అటవీ సిబ్బందికి సంబంధించి త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేసిన ఫారెస్టు డివిజన్‌లకు సంబంధించి ఖాళీ పోస్టుల భర్తీ, కార్యాలయాలకు భవనాల నిర్మాణానికి చర్యలు చేపడతామని తెలిపారు. జాతీయ జెండాలను ఇంటిపై ఎగురవేసేందుకు అటవీ శాఖ సరఫరా చేసిన వెదురు కర్రల నిధుల విడుదలకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.రంపచోడవరం సమీపంలోని భూపతిపాలెం ప్రాజెక్టు, అక్కడి కమ్యూనిటీ అతిథి గృహాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి డీఎఫ్‌వో శర్వానణ్, కాకినాడ డీఎఫ్‌వో ఐకే రాజు, సబ్ డీఎఫ్‌వో ఎస్. భరణి, స్క్వాడ్ డీఎఫ్‌వో త్రిమూర్తులురెడ్డి, రేంజ్ అధికారులు లలితకుమారి, కరుణాకర్, దుర్గాప్రసాద్, ఉషారాణి, డీవీడీ ప్రసాద్, అబ్బాయిదొర, శ్రీరామరామారావు పాల్గొన్నారు.



రంపచోడవరం సమీపంలోని భూపతిపాలెం ప్రాజెక్టు వద్ద అటవీశాఖ ముఖ్య అధికారి మధుసూదన్‌రెడ్డి

మన్యంలో ముసురు



సుంకరమెట్ట - అనంతగిరి రోడ్డులో కురుస్తున్న మంచు వాన

- ఘాట్‌రోడ్లలో మంచు వాన
- వారపు సంతలకు ఆటంకం
- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

సాక్షి, పాడేరు: మాండూస్ తుపాను జిల్లాలో ఆదివారం కూడా ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. ముసురు వాతావరణం నెలకొనడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. పాడేరు, అనంతగిరి, లంబసింగి, ధారకొండ, రంపుల, కొయ్యూరు ఘాట్‌రోడ్లల్లో మంచు జల్లులా కురిసింది. అరకులోయ మండలంలోని సుంకరమెట్ట, పాడేరు మండలం మినుములూరు, వంట్లమామిడి, చింతపల్లి మండలం కోరుకొండ, జి.కే.వీధి మండలం ధారకొండ ప్రాంతాల్లో వారపు సంతలకు ఆటంకం ఏర్పడింది.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

తుపాను ప్రభావంతో మన్యంలోని ఉష్ణోగ్రతలు కూడా క్రమేపీ పెరుగుతున్నాయి. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 20.2 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డు వద్ద 18 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డు వద్ద 16డిగ్రీల ఉష్ణోగ్రతల నమోదయ్యాయి. పల్లపు ప్రాంతాల్లో పొగమంచు ప్రభావం పెద్దగా లేదు. ఘాట్‌రోడ్ ప్రాంతాల్లో మంచు దట్టంగా కురిసింది.



జీకేవీధిలో కురుస్తున్న వర్షం

అనంతగిరి ఘాట్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు

ప్రతికూల వాతావరణంలోను అరకులోయ ప్రాంతానికి పర్యాటకులు భారీగా తరలివచ్చారు. దీంతో అనంతగిరి–అరకులోయ ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. పర్యాటకులు పలు వ్యూపాయింట్, ప్రధాన జంక్షన్లు, ,కాఫీ దుకాణాలు తదితర ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిపివేయడంతో వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ విషయం తెలుసుకున్న అరకు సీఐ జీడీ బాబు, ఇతర సిబ్బంది ఘాట్‌రోడ్డుకు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

గూడెంకొత్తవీధి: గూడెంకొత్తవీధిలో ఆదివారం భారీ వర్షం పడింది. ఏకధాటిగా కురిసిన వర్షానికి లోతట్టుప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వాగులు పొంగి ప్రవహించాయి.

బడి బాగుకోసం..

- చింతూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.9.8 లక్షలతో మౌలిక వసతులు
- నిధులు సమకూర్చిన పూర్వ విద్యార్థులు

చింతూరు: తాము చదువుకున్న బడి బాగు కోసం పూర్వ విద్యార్థులు సంకల్పించారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ముందుకువచ్చారు. చేయి చేయి కలిపి నిధులు సమకూర్చారు. చింతూరు జెడ్పీ ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవ సంబరాల వేళ పూర్వ విద్యార్థులంతా మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు. పాఠశాలలో రూ.లక్షతో తాగునీటి వాటర్ ప్లాంట్, రూ.1.7లక్షలతో వంటషెడ్డు, రూ.85 వేలతో సైకిల్‌స్టాండ్ షెడ్డు, రూ 2.25 లక్షలతో ఆడిటోరియం, రూ 3.5లక్షలతో పైలాన్, రూ 1.5 లక్షలతో మహనీయుల విగ్రహాలకు నిధులు వెచ్చించారు.

ఎంతో మంది ఉన్నత స్థాయికి..

ఇదే పాఠశాలలో పాఠశాలలో ఎంతో మంది విద్యార్థులు ఉన్నతస్థాయిలో నిలిచారు. 1985లో పదో తరగతి అభ్యసించిన జూపల్లి శివరామయ్య పోలీసుశాఖలో ఎస్‌ఐగా తన కెరీర్‌ను ప్రారంభించి ఏసీపీ స్థాయికి ఎదిగారు. ప్రస్తుతం ఈయన తెలంగాణాలోని వరంగల్ జిల్లా పరకాల ఏసీపీగా విధులు నిర్వహిస్తున్నారు. చింతూరుకు చెందిన జూపల్లి వెంకటరత్నం ఈ పాఠశాలలో 1994 బ్యాచ్‌తో పదో తరగతి చదివారు. అనంతరం ఆయన కానిస్టేబుల్‌గా తన కెరీర్‌ను ప్రారంభించి సీఐ స్థాయికి ఎదిగారు. ప్రస్తుతం వెంకటరత్నం తెలంగాణ రాష్ట్రం మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ సీఐగా పనిచేస్తున్నారు.



యోగ క్షేమాలు తెలుసుకుంటున్న పూర్వ విద్యార్థులు



ఉత్సాహంగా పూర్వ విద్యార్థులు

భారమైన హృదయాలతో..

స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో రెండు రోజులపాటు చేపట్టిన నిర్వహించిన స్వర్ణోత్సవ సంబరాలు ఆదివారం ముగిశాయి. చివరిరోజు పూర్వ విద్యార్థులంతా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను 1974 నుంచి 2022 వరకు చదువుకున్న విద్యార్థులంతా బ్యాచ్‌ల వారీగా సత్కరించి ఆశీర్వచనాలు పొందారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భారమైన హృదయాలతో స్వగ్రామాలకు పయనమయ్యారు.

మారథాన్ పోటీల్లో సచివాలయ ఉద్యోగి ప్రతిభ


10కే రన్‌లో ద్వితీయస్థానం



నగదు, సిల్వర్ మెడల్ అందుకుంటున్న గోపి

అనంతగిరి: మండలంలోని రొంపల్లి సచివాలయం వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ కొర్రా గోపి మారథన్ పోటీల్లో సత్తాచాటాడు. ఆదివారం విజయవాడలోని ఆల్ అవర్ ఇండియా ఓపెన్ మారథన్ పోటీలు జరిగాయి. ఇందులో 10కే పరుగుపందెంలో కొర్రా గోపీ ద్వితీయస్థానంలో నిలిచాడు. రూ.6వేలు నగదు, సిల్వర్ మెడల్ పొందాడు. ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ అజయ్‌కుమార్ చేతుల మీదుగా నగదు, సిల్వర్ మెడల్ అందుకున్నాడు.


వీకెండ్ జోష్



వ్యూ పాయింట్ వద్ద అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

సాక్షి,పాడేరు/అనంతగిరి: తుపాను ప్రభావంతో చలిగాలులు,వర్షాలు కురుస్తున్నప్పటికీ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు రెండు రోజుల నుంచి పర్యాటకులు పోటెత్తుతున్నారు.ప్రతికూల వాతావరణంలోను పర్యాటకులు సందడి చేస్తున్నారు. చింతపల్లి మండలం లంబసింగి, తాజంగి, జి.మాడుగుల మండలం కొత్తపల్లి, పాడేరు మండలం వంజంగి హిల్స్, హుకుంపేట మండలం సీతమ్మకొండ, డుంబ్రిగుడ మండలం చాపరాయి, అనంతగిరి మండలం బొర్రాగుహలు,కటికి జలపాతాలకు పర్యాటకులు భారీగా తరలివచ్చారు.జోరువాన,చలిగాలులలోను పర్యాటకులు సందడి చేశారు.

అరకులోయ రూరల్: ప్రముఖ పర్యాటక కేంద్రం అరకులోయకు సందర్శకులు భారీగా తరలివచ్చారు. గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్, రణజిల్లెడ తదితర పర్యాటక ప్రాంతాలు సందడిగా మారాయి. అందాలను తిలకించేందుకు కుటుంబసమేతంగా తరలివచ్చారు.



గిరిజన మ్యూజియం ముఖద్వారం వద్ద పర్యాటకుల రద్దీ

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతం వద్ద ఆదివారం ఉదయం నుంచి పర్యాటకులతో సందడి నెలకొంది. చిరుజల్లులు కురుస్తున్నా లెక్కచేయకుండా మైదాన ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు.వలిసె పూల తోటల్లో ఫొటోలు దిగారు. చాపరాయి వద్ద థింసా నృత్య కళాకారులతో సందడి చేశారు.



బొర్రా గుహలు వద్ద పర్యాటకుల సందడి

జి.మాడుగుల: మండలంలోని కొత్తపల్లి జలపాతానికి పర్యాటకులు భారీగా తరలివచ్చారు. జలపాతంలో జలకాలాడారు. వ్యూపాయింట్ వద్ద సెల్ఫీలు, ఫొటోలు దిగారు. కబాబులు, బొంగు చికెన్ అమ్మకాలు భారీగా జరిగాయి.



వలిసె అందాల్లో సెల్ఫీ తీసుకుంటున్న పర్యాటకులు



చాపరాయిలో జలపాతంలో పర్యాటకుల సందడి



కొత్తపల్లి జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

క్లుప్తంగా

అలరించిన ఆంధ్ర పద్య కవితా సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యుడు రామనరసింహం

అనకాపల్లిటౌన్: అనకాపల్లి శాఖ, డాక్టర్ భైరవ భట్ల వెంకట విశ్వనాథ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక న్యూకాలనీ రోటరీ కల్యాణ మండపంలో ఆంధ్ర పద్య కవితా సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విశాఖ కేజీహెచ్ విశ్రాంత సూపరింటెండెంట్ వి.రామనరసింహం మాట్లాడారు. ఉపనిషత్తులు అనే అంశంపై ఆయన వివరించగా, వేదములు అనే అంశంపై కవితా సదస్సు రాష్ట్ర అధ్యక్షుడు కె.కోటారావు తెలియజేశారు. పద్యం–విశిష్టత అనే అంశంపై విశాఖ గాయత్రి వైద్య కళాశాల ప్రొఫెసర్ ఆఫ్ మైక్రో బయాలజీ వైద్యుడు పేరాల బాలమురళీకృష్ణ వివరించారు. కార్యక్రమంలో కవితా సదస్సు రాష్ట్ర కార్యదర్శి పి.రామచంద్రరావు, పట్టణాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు, కార్యదర్శి రొంగలి రాంబాబు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న జీపు

- త్రుటిలో తప్పిన ప్రమాదం
- 13 మందికి స్వల్పగాయాలు



విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న జీపు

సాక్షి, పాడేరు: పాడేరు నుంచి చోడవరం వెళ్తున్న జీపు వంట్లమామిడి సమీపంలో అదుపు తప్పిన రోడ్డుపక్కన ఉన్న కరెంటు స్తంభాన్ని ఢీకొంది. పాడేరు నుంచి చోడవరం వెళ్తున్న 13 మంది ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. గాయపడిన వారు వేరే వాహనాల్లో మాడుగుల ప్రాంతంలోని ఆస్పత్రికి వెళ్లి వైద్య సేవలు పొందారు. జీపు డ్రైవర్ మద్యం సేవించి ఉన్నాడని, పరారీలో ఉన్నట్టు పలువురు ప్రయాణికులు చెప్పారు.

24 గంటల్లోనే చోరీ కేసు ఛేదన

- రూ.1.50 లక్షల రికవరీ, 2 బైక్‌లు స్వాధీనం
- 9న బాధిత వ్యాపారి కొయ్యూరు పోలీసులకు ఫిర్యాదు
- 10న ముగ్గురు నిందితుల అరెస్టు



చోరీకి పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు

కొయ్యూరు: చోరీ కేసులో పోలీసులు తమ వృత్తి నైపుణ్యతను చాటుకుని ప్రశంసలందుకున్నారు. బాధిత వ్యాపార నుంచి ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే చోరీ కేసును ఛేదించారు. దొంగతనానికి పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1.50 లక్షలు రికవరీ చేశారు. రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐ స్వామినాయుడు, కొయ్యూరు ఎస్‌ఐ రాజారావు, మంప ఎస్‌ఐ లోకేష్ కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం...

నర్సీపట్నం కొత్తవీధికి చెందిన యల్లపు గోవిందరావు మన్యంలో వ్యాపారం చేస్తుంటాడు. ఈ నెల 6న చింతపల్లి వెళ్లేందుకు బయలుదేరాడు. డౌనూరులో ఒక హోటల్ వద్ద టిఫిన్ చేసేందుకు బైక్‌ను ఆపి టిఫిన్ తింటున్నాడు. నర్సీపట్నం నుంచి అతడిని అనుసరిస్తున్న ముగ్గురు వ్యక్తులు బైక్‌పై కవర్ నుంచి రూ.1.50 లక్షలు తస్కరించారు. వెంటనే తమ ద్విచక్ర వాహనంపై ఉడాయించారు. టిఫిన్ చేసి వచ్చిన గోవిందరావు ద్విచక్ర వాహనంలో నగదు లేకపోవడంతో కంగుతిన్నాడు. చుట్టు పక్కల వారిని అడిగినా ఫలితం లేకపోయింది. దీంతో ఈ నెల 9న కొయ్యూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సీఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి డౌనూరు–నర్సీపట్నం మార్గమధ్యలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. వారిలో అనుమానిత వ్యక్తులను గుర్తించారు. వారి ఫొటోలను అనకాపల్లి జిల్లా కృష్ణాదేవిపేట, గొలుగొండ పోలీసులకు పంపించారు. సోషల్ మీడియాలోను వారి ఫొటోలు ఉంచారు. ఈ క్రమంలో కృష్ణాదేవిపేట ఎస్‌ఐ దుర్గాప్రసాద్, కానిస్టేబుళ్లు కూర్మారావు, ప్రసాద్‌ల సహాయంతో వారిని కొయ్యూరు మండలం కొండగోకిరి సమీపంలో ఈ నెల 10న (శనివారం) పట్టుకున్నారు. చోరీకి పాల్పడిన కృష్ణాదేవిపేటకు చెందిన గంటా రవీంద్ర అలియాస్ రవి, వడ్డాది మాడుగులకు చెందిన గంటా భీమరాజు, విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన అలియాస్ కుమార్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి చోరీ నగదును రికవరీ చేశారు. రెండు బైక్‌లను, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఒక్క రోజు వ్యవధిలోనే కేసును ఛేదించిన ఎస్‌ఐలను, సీఐను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

సమాజ హితం కోరేవారే జర్నలిస్టులు

ఏపీ ప్రెస్ అకాడమి ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు



మాట్లాడుతున్న కొమ్మినేని శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): జర్నలిజం అనేది పవిత్రమైన వృత్తని, జర్నలిజంలో కొనసాగుతున్న వారంతా పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని సి.రాఘవాచారి, ఏపీ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. వైజాగ్ జర్నలిస్టుల ఫోరం ఆధ్వర్యంలో కొమ్మినేనిని ఆదివారం ఘనంగా సత్కరించారు. ప్రస్తుతం జర్నలిజం, సమకాలీన అంశాలపై ఆయన ప్రసంగించారు. సమాజానికి హితం చెప్పే వారు జర్నలిస్టులై ఉండాలన్నారు. జర్నలిస్టులందరూ విలువలతో కూడినవారిగా ఉండాలనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఏ వ్యవస్థ బాగున్నా, బాగోలేకున్నా జర్నలిజం వ్యవస్థ మాత్రం నిజాయితీతో ఉండాల్సిందేనన్నారు. ప్రస్తుతం వస్తున్న మార్పులతో కూడిన పోకడలు విలువలను దిగజార్చే విధంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఇది సరైన పద్ధతి కాదని చెప్పిన ఆయన, ఒక్క రోజులోనే సమాజంలో మార్పు వస్తుందని ఆశించనక్కర్లేదని పేర్కొన్నారు. సమాజంలోని మంచిని ఆశించే వారి కోసం, సమాజం మేలు కోసం జర్నలిస్టులు పాటు పడాలని సూచించారు. నిజాలు రాస్తే..ఒత్తిడి పెరుగుతుందని, కానీ అది గర్వంగా ఉంటుందన్నారు. అబద్ధపు వార్తలు రాసి ఒత్తిడి తెచ్చుకోవడం ఎవరికీ మంచిది కాదన్నారు. ప్రెస్ అకాడమీ కార్యకలాపాల గూర్చి మాట్లాడుతూ ప్రెస్ అకాడమీ తరఫున జర్నలిస్టులకు అవగాహన తరగతులు నిర్వహించే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వపరంగా అందాల్సిన ప్రయోజనాల విషయంలో ఇప్పటికే తన దృష్టికి కొన్ని అంశాలు వచ్చాయని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ఇళ్ల స్థలాల హామీ నిలబెట్టాలని, అందుకు ప్రెస్ అకాడమీ బాధ్యతలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ డైరెక్టర్ వి.మణిరాం మాట్లాడుతూ కొమ్మినేని సారథ్యంలో ప్రెస్ అకాడమీ తరఫున జర్నలిస్టులకు శిక్షణ తరగతులు, అవగాహన శిబిరాలు ఎక్కువగా నిర్వర్తించే అవకాశం ఉందన్నారు. అకాడమీ సెక్రటరీ తిలక్, డిప్యూటీ డైరెక్టర్ వి.మణిరాం, పాత్రికేయులు ప్రభాకర్ శర్మ, కోశాధికారి పీఎస్‌మూర్తి, స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ కొరియోగ్రాఫర్ నాగరాజు పట్నాయక్, వీజేఎఫ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



పట్టుపడిన యువకులు

మద్రిపాలెం (విశాఖ): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని కంచరపాలెం పోలీసులకు అప్పగించారు. పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, స్పెషల్ బ్రాంచ్ ఏడీసీపీ గంగాధర్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథరావు సూచనల మేరకు సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. వారికి అందిన సమాచారం మేరకు కంచరపాలెం సమీపంలో కప్పరాడ ప్రాంతంలో ఎస్టీ బోయ్స్ హాస్టల్ సమీపంలో శనివారం రాత్రి రైడ్స్ నిర్వహించగా ఏఎస్ఆర్ జిల్లా అరకు, డుంబ్రిగుడకు చెందిన పూజారి సుభాష్, బురిడి సోమేష్ కుమార్‌లు గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డారని తెలిపారు. వారి నుంచి 2.5 కేజీల గంజాయి, నాలుగు మొబైల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అనకాపల్లి టౌన్: మద్యం మత్తులో బాత్‌రూమ్‌లో యాసిడ్ తాగిన ఎ.శ్రీనివాసరావు(39) విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందాడు. రూరల్ ఏఎస్ఐ అర్జున కథనం మేరకు.. మండలంలోని శంకరం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు లంకెలపాలెంలో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మద్యం సేవించి, ఇంటికి చేరుకున్న ఆయన మద్యం మత్తులో బాత్‌రూమ్‌లోని యాసిడ్ తాగి పడిపోయాడు. భార్య వెంకటలక్ష్మి, తన ఇద్దరు పిల్లలతో గ్రామంలో జరిగిన అంబలం పూజకు వెళ్లి, తిరిగి ఇంటికి చేరుకుంది. బాత్‌రూమ్‌లో పడిపోయిన భర్తను గుర్తించి, వెంటనే అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం విశాఖ తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. భార్య వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ చెప్పారు.

మంత్రి అమర్‌నాథ్ దంపతులు మొక్కులు చెల్లింపు



మంత్రి అమర్‌నాథ్ హిమ గౌరీ దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ఈవో చంద్రశేఖర్

అనకాపల్లి టౌన్: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారికి పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హిమగౌరీ దంపతులు ఆదివారం మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా ఘటాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని నైవేద్యం సమర్పించారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పెందుర్తి, పాయకరావుపేట ఎమ్మెల్యేలు అన్నంరెడ్డి అదీప్ రాజ్, గొల్ల బాబూరావు, ఉమ్మడి విశాఖ జిల్లాలో పలువురు పార్టీ నేతలు నూకాంబిక అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి పండుగలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐదు వేల మంది భక్తులకు మంత్రి అమర్‌నాథ్ దంపతులు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన ఆటో డ్రైవర్ మృతి



మృతుడు రవి(ఫైల్)

రాజవొమ్మంగి: పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఆటో డ్రైవర్ కుడుముల రవి(30)కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. బంధువుల కథనం మేరకు రాజవొమ్మంగికి చెందిన రవి కుటుంబ కలహాల నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురై శుక్రవారం ఆటోపై ఊరి చివరనున్న సుగర్ ఫ్యాక్టరీ ప్రాంతానికి వెళ్లాడు. అక్కడ నిర్జన ప్రదేశంలో తన వెంట తెచ్చుకున్న గడ్డి మందును సేవించాడు. అదే సమయంలో ఓ స్నేహితుడు ఫోన్ చేయడంతో, అతనికి విషయం తెలిసింది. దీంతో రవి స్నేహితులు, అతని భార్యను వెంటబెట్టుకుని ఆ ప్రాంతానికి చేరుకున్నారు. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న రవిని స్థానిక పీహెచ్‌సీకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం సిబ్బంది రవిని కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. మృతునికి భార్య బంగారం, బాబు జర్మియ(9), పాప స్నేహిత(7), తల్లి రాణి ఉన్నారు. కుటుంబాన్ని పోషించే పెద్ద దిక్కు చనిపోవడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు స్థానిక ఎస్సై టి.నరేంద్ర ప్రసాద్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని సోమవారం కుటుంబ సభ్యులకు అప్పగిస్తామన్నారు.

ఆర్టీసీ బస్సును, ఆటోను ఢీకొట్టి.. కాలువలోకి దూసుకుపోయిన లారీ

స్వల్ప గాయాలతో బయటపడిన ప్రయాణికులు



ప్రమాదంలో బోల్తాపడిన ఆటో, కాలువలోకి దూసుకుపోయిన లారీ

యలమంచిలి: ఆగివున్న ఆర్టీసీ బస్సును, దానిముందున్న మరో ఆటోను ట్రక్కు లారీ ఢీకొట్టి కాలువలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో స్వల్ప గాయాలతో ప్రయాణికులు బయటపడ్డారు. యలమంచిలి మున్సిపాలిటీ కొక్కిరాపల్లి గురుకుల పాఠశాలకు ఎదురుగా ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. తుని నుంచి విశాఖపట్నం వెళ్తున్న ట్రక్కు లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దాంతో ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోయినప్పటికీ సంఘటన చూసి పలువురు నిర్ఘాంతపోయారు. సమాచారం మేరకు యలమంచిలి రూరల్ ఎస్‌ఐ సన్నిబాబు సంఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారంతా అచ్యుతాపురం ప్రాంతానికి చెందిన వారని తెలిసింది. యలమంచిలి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవల నిమిత్తం కుటుంబ సభ్యులు విశాఖపట్నం ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. ఈ ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ తెలిపారు.

రంగురాళ్లు తవ్వకాలపై పుకార్లు

ఆరిల్లోవ అటవీ ప్రాంతంలో అధికారుల తనిఖీలు



అటవీ ప్రాంతంలో సోదాలు చేస్తున్న అధికారులు

గొలుగొండ: మండలంలోని ఆరిల్లోవ అటవీ ప్రాంతంలో శనివారం అర్ధరాత్రి రంగురాళ్ల తవ్వకాలపై వచ్చిన పుకార్లతో అటవీ, పోలీస్, రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. ఆదివారం తెల్లవారు నుంచి రంగురాళ్ల తవ్వకాల స్థావరాలను గుర్తించేందుకు అటవీ ప్రాంతమంతా ఆరిల్లోవ రిజర్వ్ ఫారెస్టు సిబ్బంది గాలించారు. శనివారం అడ్డల్లోవ, సుద్దలపాలెం ప్రాంతాలకు చెందిన కొంతమంది తవ్వకాలు చేస్తున్నట్టు అధికారులకు సమాచారం అందింది. ప్రధానంగా ఆరిల్లోవ రిజర్వ్ ఫారెస్టు పరిధిలోని పురటాలమ్మతల్లి గుడి ప్రాంతంలో తవ్వకాలు జరుగుతున్నాయని తెలిసిన అటవీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఇక్కడ ఐదేళ్ల క్రితం క్వారీ తవ్వకాలు చేపట్టారు. నాణ్యమైన రంగురాళ్లు దొరక్కపోవడంతో క్వారీ మూతపడింది. మరలా ఈ ప్రాంతంలో తవ్వకాలు చేస్తున్నారా? అనే కోణంలో అటవీశాఖ, పోలీస్ అధికారులు విచారణ చేస్తున్నారు. రిజర్వ్ ఫారెస్టు దట్టంగా ఉండటంతో సిబ్బందికి శోధించడం కష్టతరంగా మారింది. పప్పుశెట్టిపాలెం పాత రంగురాళ్ల స్థావరంలోనూ నిఘా ఏర్పాటు చేశారు. ఇక్కడ రంగురాళ్ల తవ్వకాలకు స్థానికులు వెళ్లడానికి అవకాశం ఉండటంతో ఈ చర్యలు తీసుకున్నారు. ఇప్పటి వరకు ఎక్కడా తవ్వకాలు జరిగినట్లు ఆధారాలు లభించలేదని, కేవలం పుకార్లు వచ్చాయని అధికారులు చెబుతున్నారు. ఏదేమైనా పోలీస్, అటవీ, రెవెన్యూ అధికారులు నిఘా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఈనాటి ఈ బంధం ఏనాటిదో...

చౌడువాడలో నర్సీపట్నం గురుకుల పూర్వ విద్యార్థుల సందడి



నాటి గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కె.కోటపాడు: చిన్ననాటి మిత్రులను కలుసుకుంటే ఆ ఆనందమే వేరు.. ఎక్కడా లేని ఉత్సాహం రెక్కలు తొడుగుతోంది. ఆనాటి జ్ఞాపకాలు ఒక్కసారిగా ఊసులాడుతాయి. అటువంటి సందడి వాతావరణం కె.కోటపాడు మండలం చౌడువాడలోని డేన్ వుడ్ రిసార్ట్ వేదికగా ఆవిష్కృతమైంది. నర్సీపట్నంలో గురుకుల బాలుర పాఠశాల ప్రారంభమైన 1983 నుంచి 2021 వరకూ అక్కడ చదువులు సాగించిన విద్యార్థులంతా ఏటా డిసెంబర్ రెండో ఆదివారం ఆత్మీయ కలయిక ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా 1997 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఈ ఏడాది ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారంతా సందడి చేశారు. తోటి విద్యార్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాటి ఉపాధ్యాయులు మెల్కియార్, వెంకటరెడ్డి, ఆనంద్‌కుమార్, సాయికుమార్, రాంబాబులను పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ బండారు రామచంద్రరావు మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సహకారంతో ప్రస్తుతం చదువులు సాగిస్తున్న విద్యార్థులకు స్ఫూర్తిగా ఉండేందుకు పలు కార్యక్రమాలను పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రూ.30 లక్షలతో అత్యాధునిక గ్రంథాలయం నిర్మించామన్నారు. ఏడాదికి ఒక రోజు గురుకులంలో బడి నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించిన ప్రస్తుత విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి డేన్ వుడ్ రిసార్ట్ యజమాని, పూర్వ విద్యార్థి దొగ్గ అచ్చింనాయుడు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కె.వి.అప్పారావు, గోవిందనాయుడు, వైద్యులు వరప్రసాద్, దేముడుబాబు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని తాకడంతో షాక్

ఖండేపల్లిలో అక్కడికక్కడే రజకుడి మృతి



మృతుడు మలి పాక అప్పారావు

చోడవరం రూరల్: మండలంలోని ఖండేపల్లిలో ఆదివారం సాయంత్రం మలి పాక అప్పారావు(55) విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. రజక వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న అతడు స్థానిక ప్రధాన రహదారి వద్ద కిరాణా దుకాణానికి వెళ్తుండగా పొరపాటున విద్యుత్ స్తంభాన్ని తాకాడు. మాండూస్ తుపాను కారణంగా మధ్యాహ్నం నుంచి వర్షం కురవంతో స్తంభం పూర్తిగా తడిసిపోయింది. దాంతో స్తంభానికి విద్యుత్ ప్రసరించడంతో ఒక్కసారిగా షాక్ గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. చుట్టు పక్కల వారు వచ్చి విద్యుత్ సిబ్బంది సహాయంతో సరఫరా నిలిపివేసి చోడవరం ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేయగా, అప్పటికే అతడు మరణించినట్టు గుర్తించారు. మృతుడు అప్పారావుకు వివాహమైన కుమార్తె మాత్రమే ఉంది.

వేదపండితులకు సత్కారం

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): మార్గశిర మాసం పురస్కరించుకొని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆదివారం సాయంత్రం అర్చక సదస్సు, పండిత సత్కారం నిర్వహించారు. కార్యక్రమానికి దేవస్థాన వేదపండితులు పాల్గొని కళాకారులచే వాతాపి గణపతింభజే అనే కీర్తనతో ప్రారంభించి పలు కీర్తనలు నాదస్వర కచేరి చేయించారు. దేవస్థాన విద్వాంసులు పాల్గొని కచేరీ చేశారు. అనంతరం సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు అర్చక సభ నిర్వహించారు. వేదసభ, అర్చక సదస్సును విశాఖ శారదాపీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి ప్రారంభించారు. వేదపండితులు, అర్చకులకు పండిత సత్కరించారు.

కానరాని యువకుడి ఆచూకీ

పెద్దేరు జలాశయంలో కొనసాగుతున్న గాలింపు చర్యలు



పెద్దేరు జలాశయంలో మరబోట్లు ద్వారా గాలింపు చర్యలు చేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: మండలంలో కింతలి గ్రామానికి చెందిన దామరౌతు శ్రావణ్‌కుమార్ పెద్దేరులో దూకిన నేపథ్యంలో మూడో రోజు ఆదివారం గాలింపు చర్యలు కొనసాగాయి. ఈ నెల 9న ఉదయం నుంచి మాడుగుల అగ్నిమాపక శాఖ, జాతీయ విపత్తుల నివారణ సంస్థ సిబ్బంది రంగంలోకి దిగి మరబోట్లు ద్వారా నదిలో వెతుకుతున్నారు. అయినప్పటికీ ఆచూకీ తెలియరాలేదని మాడుగుల అగ్నిమాపక దళాధికారి బోగీశ్వరరావు తెలిపారు. పెద్దేరులో దూకి తాను చనిపోతున్నానని, బంధువులకు, స్నేహితులకు శ్రావణ్‌కుమార్ ఫోన్లో సమాచారం అందించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో వర్షాన్ని సైతం లెక్క చెయ్యకుండా మరబోట్లు ద్వారా గాలిస్తున్నారు. ఎస్‌ఐ పి. దామోదరనాయుడు, వీఆర్వో రమణ, ఎన్డీఆర్ఎఫ్ టీమ్ ఇన్‌స్పెక్టర్ జి. ఈశ్వరరావు, డిప్యూటీ తహసీల్దారు పి. సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు రమణమ్మ, సర్పంచ్ దారమలేశ్వరి, తదితర్లు గాలింపు చర్యలను పర్యవేక్షించారు.

సామాజిక హితోక్తులు వచన కవితా ఆవిష్కరణ



పుస్తకావిష్కరణలో పాల్గొన్న పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

సీతమ్మధార (విశాఖ ఉత్తర): చక్కని సరళమైన భాషతో వివిధ అంశాలు తీసుకుని సమాజాన్ని చైతన్య పరిచేలా సామాజిక హితోక్తులు ఉండడం అభినందనీయమని పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో డాక్టర్ నందూరి రామకృష్ణ విరచిత ×సామాజిక హితోక్తులు× వచనా కవితా సంపుటిని యార్లగడ్డ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం దినపత్రికలలో ప్రచురితమయ్యే వార్తలను వచన కవిత్వంగా తీర్చిదిద్దిన తీరు చాలా బాగుందని నందూరి రామకృష్ణను కొనియాడారు. ప్రముఖ సాహిత్య విశ్లేషకుడు దాముర వెంకట సూర్యారావు మాట్లాడుతూ నందూరి సమాజాన్ని స్పృశించి అవగాహనతో పరిపక్వతతో పలు అంశాలను తన కవితల రూపంలో నేటి తరానికి అందజేయడం సముచితమన్నారు. ఐఐపీఈ మాజీ డైరెక్టర్ ఆచార్య వీఎస్ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ నిత్యం ఏదో ఒక అంశాన్ని తీసుకుని తన కాలాన్ని, కలాన్ని సంధిస్తూ సమాజాన్ని చైతన్య పరిచే ప్రక్రియ అభినందనీ యమన్నారు. తెలుగు ఉపన్యాసకులు డా.బి.రజని మాట్లాడుతూ మహిళా దినోత్సవం, సెల్‌ఫోన్ ఉపయోగం, రాజకీయ పార్టీల పాలనా ఇలాంటి అంశాలు సంకలనంలో చక్కగా పొందుపరచడం విశేషమన్నారు. సంఘ సేవకులు, ఎసీఎస్ టెక్నాలజీ అధినేత కమల్ బైద్, మల్లాది సోమేశ్వర శర్మ, కవయిత్రి శ్రీమణి, కళావేదిక కార్యదర్శి నందూరి లలితా దేవి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.